మధ్యాక్కర

బాగా ఝాము పొద్దెక్కిందిః అప్పటి కప్పుడే **తా**తగారు అనుష్ఠానాలన్నీ తీర్చుకుని దొడ్డివసారాలో, సుస్తుగా బాసెపట్టుమీద కూర్చుని, – పుస్తకంలో బొమ్మలవంక, కడుపునిండేట్టు చూస్తున్నాడు. అమ్మమ్మ పూర్తిగా మడికట్టుకుని – పార్వతీదేవికి మల్లే, అర్ధణా అంత కుంకుంబొట్టుతో సందిట మంచినీళ్ళ కడవ, – మరోచేత్తో, కరివేప రెమ్మలూ పట్టుకుని, – వంట యింట్లోకి వెళ్ళిపోతూ, ఆ చాయలకు వచ్చింది!

అగు! అమ్మీ! అన్నారు తాతగారుః అగి అలానే నిలుచుందిః ఆయన ఫామేదాగా, ఎగాదిగా చూసిః–

భేష్! ఇంకా ఆడదానివే! – అని మెప్పుగా తల ఊగించారుః

అమ్మమ్మకు సర్వసాధారణంగా తాతయ్య మాటలు అర్ధంకావుః కాని; ఆయన నోటివెంట వచ్చేది, అహర్నిశమూ ఛలోక్తులేననీ – అంత పండుతనం వచ్చినా, – ఆమె కంటపడగానే ఆ మారాజు, బాల కుమారుడేననీ, – ఆవిడకు ఓ నమ్మకం! అమ్మమ్మ ముసిముసి నవ్వులతో లోపలికి చక్కా బోయింది;–

అంటే ఏమిటి తాతయ్యా! – అన్నాను రవంత దగ్గిరకు జరిగిః

అంతేనోయ్! – మీ అమ్మమ్మ ఇంకా ఆడదేః–

–అనగా?–

అది, మా తాలూకు రహస్యం! – అయినా, – నీకు చెప్పవచ్చునులే – పువ్వు – పుట్టగానే పరిమళిస్తుంది! ఆడది మటుకు వయసువచ్చినకొద్దీ రెట్టిపోతుంది! ఒంపులు ఒంటపడతాయ్! – చిన్నప్పుడు మా ఆవిడ అలవోకగా త్రిభంగిగా నిలిచేది! మీ అమ్మమ్మ అయిన తరువాత, – కడవరొండిన పెట్టుకుంటేనేగాని, ఆ భంగిమం రావడంలేదు!

అదీ, నా అదృష్టమే అనుకోవాలి – కొందరు కుసుమ కోమలులు, – యీ పడిలో, కోరమీసం పెంచుకుని, కొరకరాని కొయ్యలైపోతారు. అమ్మమ్మమటుకు అంతో యింతో ఆడ – రేక దక్కించుకుందయ్యా!–

ఇంతలో అమ్మమ్మ యిటువచ్చిందిః–

–రా! – ఇలా కూర్చో? అన్నాడుః

నేను – మడి! – అని జంకిందిః

మనం ఒక్కమ్మడి! – రా పిల్లా! – అని ఆయన చేజాచాడు! – నేను అక్కడనుంచి లేచానుః–

కూచోరా – నాన్న! – అంది, అమ్మమ్మ!–

కాస్సేపు వాడు పరపురుషుడే! – నిష్క్రమించనీ –

నేను లోపలికి తప్పుకున్నాను. అమ్మమ్మ – మోకాళ్ళు పట్టుకుని నింపాదిగా చతికిలపడ్డది:–

తాతయ్య పుస్తకం విప్పి, అమ్మమ్మ ముందుకు జరిపాడు. అది, – అజంతాబొమ్మల పుస్తకం!–

అమ్మమ్మ ఉలికిపడ్డట్టు చూసి, – తాతయ్యవంక కోపంగాచూసి, – "అవ్వ!" అన్నట్టు నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుంది, – యిదేం విడ్డూరం! – అనుకుంది!

వెర్రిపిల్లా! తీగెకు కాయలు బరువు టే! అన్నాడు లాలనగా తాతగారు!

ఇదేదో విశ్వామిత్ర సృష్టి – అంది అమ్మమ్మ!–

అవునే అమ్మీ, ఇలాటి సృష్టి సన్యాసి చేతనవుతుంది కాని, సన్యాసికాని సంసారికి తీరుబడి ఉంటుందా?–

ఒరేయ్ బాబూ ఇవి అనుభవంమీద అంటున్న ముక్కలేరా– వింటున్నావ్ కాదూ? – అని నాకు తగిలేట్టు కేక వేశారు తాతగారు – అమ్మమ్మ నవ్వు అందెలమ్రోతల్లే నన్ను తరుముకువచ్చింది. నేను ఇంకా లోపలికి వెళ్ళిపోయినాను –

2

తాతగారు, రమారమి ఏడాదినుంచి తీరుబడిగా కూర్చుని గీర్వాణంగా ఒక పద్యకావ్యం వ్రాశారు. అవాళ మధ్యాహ్నం, దాని పీఠిక అంతా తెలుగులో వివరించడం ప్రారంభించాడు. చేగోడీలు ఫలహారంచేస్తూ – అమ్మమ్మ బియ్యంలో రాళ్ళుచేస్తూ సరసనే కూర్చున్నది. నాకు నిద్ర మత్తుగాఉంది. కాని, ఆయన ఎప్పుడు నోరువిప్పినా ఏదో ఒకటో అరో మడతపేచీ రానేవస్తుంది కనుక, – అందుకోసం నేనూ మెలకువగానే ఉన్నాను – తాతగారు తరువాయి ఎత్తుకున్నారు.

..."సన్యాసికి అతి ముఖ్యం సంసారసుఖమని, మనకు ప్రామాణికంగా తేలింది. తాను ఉత్తరోత్రా తరించడానికీ, యీలోగా తత్త్వాన్ని తరచిచూడటానికి దాంపత్యసుఖం ముఖ్యావలంబనం. గాధిరాజు కొడుకు, ఎంతకాలం జడలు కట్టించుకొని శిఖలోంచి నిప్పులూ సెగలూ క్రక్కించినా! – చివరకు మేనక చేతిలోకాని, కీలకం చిక్కలేదు."

పుట్టీ పుట్టడంతోటే, ఉపనయనానికి ఎదిగి నిలుచున్న పరాశరుడి కొడుకు తల్లి పనుపున – ఆ మాత్రమింగక తప్పింది కాదు. నిన్నో, మొన్నో మన శంకరుడుకూడా ఫలానారాజు శరీరంలో ప్రవేశించి, తద్వారా అంతఃపురంలో ప్రవేశించి, ఆ పాదాలు వల్లించవలసి వచ్చింది.

ఇంతవరకూ విని, అమ్మమ్మ మనసులో "శివశివ," అని గొణుక్కుంటో చెవులు మూసుకున్నది, తాతగారు, చిరునవ్వుతో – "అప్పుడే ఏమైనట్లు, వినవలసింది ముందు ఉందే పెళ్ళికూతురా!" అన్నారు. అమ్మమ్మకళ్ళనీళ్ళ పర్యంతం అయి, "నేను – అజ్ఞానురాల్ని – నా చెవుల ఇలాటివి పడవేయకండి!" అని బ్రతిమాలుకుంది.

"ఏం! చెడిపోతావా?"

అమ్మమ్మ తలవంచుకు కూర్చుంది.

తాతగారు, నావైపుచూచి,

ఏమిటోయ్! – మా ఆవిడ వాలకం? నీ కేమన్నా అర్థం అయిందా? మనం బూతులు మాట్లాడుతున్నామని అనుకున్నదా ఏం? మడిగట్టుకుని – మాంచి

వైదిక భాషలో వ్రాశాంకదః ఇంతకూ అమ్మీ! – మండనమిశ్రుడి పెళ్ళాం, మహా పతివ్రత అని మనం ఒప్పుకుంటున్నామా? బడితలాటి పరాయి మొగవాడిని – అందులోనూ పైపెచ్చు పరమ సన్యాసిని పట్టుకుని, పట్టపవలు – కామశాస్త్రంలో పరీక్ష ఇవ్వమందే! – అలా అడగటం – బూతంటావా! –

ఏంరా నాన్నా – కృష్ణపరమాత్మ, డబ్బూదస్కమూ లేనివాడంటావా! – లక్ష్మీదేవి మొగుడికి కొనుగోలుశక్తి బొత్తిగా లేదంటావా? కన్నకొడుకును తీసుకువెళ్ళి ఎలాటి కొంపలో కాపురం పెట్టాడు? – తాను అహర్నిశలూ అక్కడికి వచ్చి పోతూండేవాడేకద! – పరమాత్మకు తట్టని బూతు పామరుల కెందుకోయ్! అందాకా ఎందుకూ, నల్లనివాడు పద్మనయనంబులవాడు దాంట్లో చివరిపాదం మైలపడకుండా అర్థం చెప్పు. ఎంతమంది పడుచులు నోటపట్టి వర్ణించడంలేదు? అమ్మీ – బూతనుకుంటే, కులకాలిగాని – ఉలిక్కిపడటం – భామలకు లక్షణంకాదే –

అమ్మమ్మ మళ్ళీ చెవులుమూసుకునేందుకు సిద్ధంఅవుతూండగా – ఇంతలో, వాకిట్లో ఏదో బండీవచ్చి ఆగింది. ఎవరో పిల్ల దిగింది – మెట్లు ఎక్కి, లేడికిమల్లే లోపలికి వచ్చేసింది. తాతయ్య అట్టే పరకాయించి చూశారు. మొగం మరీ విప్పారింది.

"నేను శశిరేఖ మనుమరాల్ని" అంది – వచ్చిన పిల్ల కన్నునిండుగా చూస్తూ.

తాతగారు – బాసెపట్టు సరిచేసుకుని – "అఁ అట్లాగుటే భడవా? అప్పుడే ఇంతదానవైనావూ?" అంటూ దగ్గిరకు లాక్కుని సరసను కూర్చోపెట్టుకున్నారు.

"మీ అవ్వ – లేచి తిరుగుతూందికద" – పిల్లది నవ్వుతూ తల ఆడించింది.

"గజ్జెఘల్ మంటూందా?" – చిన్నది, బుగ్గలుసొట్టలు పడేసుకుంటూ పెదవి రవంత విరిచింది.

"పాత పందిరిపట్టెమంచం – బాగున్నట్టేకద? –" తాతగారిమీదికి అలా ఒరగపోయి, ఫక్కున నవ్వింది:–

అమ్మమ్మ బిక్కమొగం వేసి – "నీ పేరేమిటే అమ్మాయ్!" అని గొంతు సవరించుకుంది:–

"అమ్మమ్మ పేరే పెట్టుకుంది!"– తాతయ్య కేసిచూసి జవాబు చెప్పింది – చిన్నది.

"అయితే...మాబాగే!" తాతగారు, పిల్లను మరింత దగ్గిరకు తీసుకున్నారు.

"డుగో ఆ ప్రబుద్ధుడు. మా మనవడు! – మనపేరే పెట్టారు! – ఆ తల వంచుకోవడం అంతా, బిడియం అనుకునేవ్ – ఓరగా మనవంక చూస్తున్నాడు! –"

చెంపమీద కొట్టినట్టు అన్నారు: తప్పనిసరిగా తల ఎత్తాను. ఆ పిల్ల వందమంది సరసులున్న సభను చూసినట్లు నావంకచూసి, అయిదు పది చేసింది! తాతయ్య – మెరమెచ్చుగా తల ఊగించారు.

..."అయ్యగారి పాదాలు కళ్ళకు అద్దుకురమ్మని – అమ్మమ్మ పంపించింది!" అని చిన్నది మనవిచేసింది. ఝల్లుమని ఎగిరి నిలుచున్నది – తాతగారు – కన్నువాల్చి కాలివంక చూశారు. చిన్నదాని ఎడమకాలికి – రవ్వలు చెక్కిన అందెవేసియున్నది.

తాతగారు – జమిలి చిటికెలతో తాళం వేస్తున్నారు. ఆ చిన్నది మెరుపల్లే కాలు కదుల్చుతున్నది. అమ్మమ్మ నోరు అలా తెరచుకుని అబ్బురంగా చూస్తున్నది.

చిన్నది – తాతగారిచేత సెబాస్ అనిపించుకున్నది.

ఆ తాళం ఏమిటని అడిగాను:

"ఎత్తుకున్నది చంద్రకల – ఝుళుకిచ్చింది – రాజ మార్తాండం–"

"మరి, తాళాలు ఏడేకద!" అతి తెలివిగా అడిగాను.

"ఆడలేని సాని అయితే తాళాలు ఏడేనోయ్! – అది, అందెవేసిన కాలు–"

అమ్మమ్మ మడిగట్టుకుంటానని – లేచింది.

"ఇప్పటికి ఇరవై ఏళ్ళనుంచీ కట్టుకునేఉన్నావు కదా, ఇంకా రంధి తీరలేదూ," అని తాతగారు అంటూన్నా వినిపించుకోలేదు.

"మీ అమ్మమ్మకు ఇప్పటికి అర్థం అయిందోయ్... వచ్చింది...సానిపాప అని!..." అంటో తాతగారు నవ్వారు.

ఆ చిన్నది... బెదురుగా – కోపంగా, కంటికి నీరు తెచ్చుకున్నది. తాతగారులేచి, సందిట పొదువుకున్నారు. అలాగే మనుమరాల్ని ముద్దుచేశారు. చిన్నది, అంతలో తెప్పరిల్లింది! –

ఏమిటిది?? – రపీమని అడిగారు తాతగారు.

కిలికించింతం: తడుముకోకుండా జవాబు చెప్పింది. తాతగారు, అప్పటికి చేయెత్తి దీవించారు.

సంజెపడేలోపున, తాతగారు అంగడివీధికివెళ్ళి, చిన్నదానికి చీరె, సారె పట్టుకు వచ్చారు. అయనే స్వయంగా, జడవేశారు. ఘుమఘుమలాడేట్టు చేశారు. యధావిధిగా అనుష్ఠానాలన్నీ తీర్చుకుని – తాము దగ్గిరకూర్చుని, – చిన్నదానిచేత పాయసం త్రాగించారు. మల్లెలపానుపుమీద, – పోయి నిదురచెయ్యమన్నారు. అవ్వచేత, ఒక పెద్ద మొహరీ యిప్పించారు.

రాత్రి పన్నెండు అయింది. నాకు నిద్రరాలేదు – రానంటూంది. తాతగారు వచ్చి, నా పక్కమీద కూర్చున్నారు. నేను కంగారుగా లేచి కూర్చున్నాను: వెన్నుతట్టుతూ – "నీవు యిక్కడ పడుకుంటావని మనం కలకనలేదు సుమీ!–" అన్నారు.

"అదేమిటి తాతయ్యా!–" అన్నాను ఉక్రోషంగా –

"అఁ–ఏం లేదు అని తెలుసులే! – మీరందరూ పుట్టు సన్యాసులురా –!"

"అంటే –!"

"పది నవరసులు బనారసుచీరె కొంగుని ముడివేసి – మినప సున్నిఉండలు గుటకేసి – చీకటిగదిలో దోమల తెరలో – చివికిపోవల్సిన పుణ్యజనులు! –" తాతయ్యకు అంత కోపం రావడం నే నెప్పుడూ చూడలేదు.

"నేను – నీ మనుమణ్ణే" – అని, తాచల్లే లేచాను.

"ఔనోయ్ – కాని – మనకూ మనకూ ఒక నూరేళ్లు వార ఉంది:– ఈ ఇరవయ్యో శతాబ్దంలో – సుఖంగా పాపం చేయగలిగిన మొనగాడు అంటూ లేడురా నాయనా – మీరందరూ పూజ్యులు –!"

అలాగే తెల్లవారింది, ఆ చిన్నది – వృద్ధ దంపతుల దగ్గిర సెలవుపుచ్చుకుని, వెళ్ళిపోయింది. నా మనసు మటుకు అప్పటి కప్పుడు బండివెంట పరుగెత్తింది.

లోపలనుంచి, – తాతగారి గొంతు మ్రోగుతూంది.

"బూతంటే అదేనే అమ్మీ – నీకు సరేసరి; అర్థం కానేకాదు, నీ మనుమడి కంటావా అవసరమేలేదు. ఏదో యీ యింటి మొత్తానికి, నే నొక్కణ్ణే ఇలా దేవుళ్లాడవలసిన వాణ్ణి!" అమ్మమ్మ బిగ్గరగా నవ్వుతూంది. నవ్వుతోనే ఇటువచ్చి, నన్ను చూసి నవ్వేసి, పసిపిల్లవాణ్ణి బుజ్జగించినట్లు, "మా నాయనకదూ, మా నాయనే?" అంది. మళ్ళీ నవ్వింది: నాలుగందాలుగా నవ్వింది. అమ్మమ్మంటే అంతవయసులోనూ, తాతగారు ఎందుకు పట్టుకు ప్రాకులాడుతారో, అప్పటికి నాకు అర్థమైంది!

3

దేవీ నవరాత్రాలకు, కాశీనుంచి, తాతగారి సహాధ్యాయి, పండువంటి మహా మహోపాధ్యాయుడు, భార్యా, తానూ వచ్చారు. మా యింటికి చుట్టపుచూపుగా.

"అహాఁ, ఏంకళ అండీ, సాక్షాత్తూ పార్వతీదేవి," అని, అమ్మమ్మ ఆ యిల్లాలిని చూసి ముచ్చటపడ్డది. పలువిధాలుగా మెచ్చుకుంది.

తాతగారూ, ఆ వచ్చిన తాతగారూ ఇద్దరూ యింటిన పడి పసిపిల్లలకుమల్లే ఒకటే ఏక అల్లరి; ఆ రెండు సింహాలు చూడ ముద్దుగా ఉన్నాయి. కాని, వాళ్ళమాట నాకూ, అమ్మమ్మకూ పిసరంతైనా అర్థంకాకపోయె.

అమ్మమ్మకు ఒకందుకు మటుకు తృప్తికలిగింది. ఆవిడ అభిప్రాయం – కాశీలో అసలు బ్రాహ్మణులంటూ ఉండనే ఉండరని – చదువుకోసమో, సంపాదనకో – ఇటువైపునుంచి వెళ్ళినవాళ్ళు తప్ప: ఆ పండితుడుమటుకు బ్రాహ్మణుడే అని, తాతగారు ప్రమాణం చేసినంత కట్టుదిట్టంగా చెప్పారు.

ఆ మొగుడూ పెళ్ళాం యిద్దరూ – చిలకా గోరింకల్లే ఉండటంచూసి – పిల్లా పాపా లేనందువల్ల అల్లా ఎగిరి గంతేస్తున్నా రేమో అనుకుంది అమ్మమ్మ. నా అంత మనవళ్ళు వాళ్ళకూ ఉన్నారని తెలుసుకొని – ఆ దేశం మనుష్యుల తీరు ఎన్నేళ్ళువచ్చినా అంతేకాబోలు అని సరిపుచ్చుకుంది. తానూ ఆ యిల్లాలిని చూసి ముచ్చటపడింది.

నిజంగా వాళ్ళువున్న ఆ నెల్లాళ్ళూ – మా యింట్లో పండుగగా ఉంది. వెళ్ళిన తరువాత, ఒకరోజు... రోజల్లా అమ్మమ్మ కాలుగాలిన పిల్లికిమల్లే తిరుగుతూంది: అనుక్షణమూ ఆవిడనే తలచుకుంటూ ఉంటుంది. ఆ చక్కదనం వేనోళ్ళ పొగడుతుంది.

"వాళ్ళ చెల్లెలు ఒకమ్మాయ్ ఉంది. ఇంతకన్నా బంగారుబొమ్మ" అన్నారు తాతగారు.

"చూస్తే బాగుండునే –" అని రెపరెపలాడింది అమ్మమ్మ.

"బాగుండును – కాని ... నాకు ఆ యోగంలేదు!"

"ఏం?"

"వాళ్ళకు ఘోషా!"

"అంటే?... బ్రాహ్మణులకు ఘోషా ఏమిటి?"

"బ్రాహ్మణులకు ఘోషా కూడానా??"

"మరి..."

"వాళ్ళు నవాబులు..."

"రామరామ!...తురకవాణ్ణి కట్టుకుందా?"

"ఊఁ...!"

"పండంటి బ్రాహ్మణపిల్ల!"

"కాదు, బంగారంలాంటి తురకపిల్ల"

"అఁ, అఁ, ఏమన్నారూ ... ఏమన్నారూ!"

"అంతే... ఉన్నమాటే...!"

"మరి...యీావిడ..."

"వాళ్ళ అక్కయ్యే!"

"అక్కయ్యే!..."

"సాక్షాత్తూ!... ఒక్క తల్లి కడుపున ... ఒక్క తండ్రి పనుపున..."

అమ్మమ్మ, వడదెబ్బ తిన్నట్టు ... తూలి ... పడబోయి ... ఎల్లా వెళ్ళిపడ్డదో ... ఏడుకొండలవాడి పటం ముందు ప్రాణాచారం! ...

"అపచారం స్వామీ ... అపచారం ..." అంటూ ఎలుగు రాచుకుపోయిన గొంతుతో...

"తాతగారు ... ఒక్క నిమిషం నిదానించి ... లోపలకు వెళ్ళి ... అమ్మమ్మకు చేరువగా నిలుచుని ... భక్తి తాత్పర్యాలతో ... స్వామీ ... నా యిల్లాలిని మన్నించు ... తెలియక అపచారం చేస్తూంది? బీబీనాంచారు నీ ప్రాణేశ్వరి అని ... ఈ పసిదానికి తెలియదు"...

అమ్మమ్మ... తెల్లబోయి... అలా తాతగారి కాళ్లు పట్టుకోబోయింది! ఆయన ... శశిరేఖ మనుమరాలిని అక్కున జేర్చుకున్న ఒడుపులో ఆమెను దగ్గిరకు తీసుకుని...

"ఆయనెంతో... ఈయనాఅంతే ... ఇందులో మటుకు యిద్దరూ ఒకటే ..." అంటున్నాడు ... అమ్మమ్మ వికలంగా నవ్వింది...

వాళ్ళిద్దరికీ... నేను ఎంతో దూరంనుంచి దణ్ణం పెట్టాను.

★ ★ ★